మూసీ ప్రక్షాళనతో రైతులకు మేలు

● ఎంపీ చామల, ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం

మానాయికుంటలో ప్రజాచైతన్య యాత్రలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

అడ్డగూడూరు, అక్టోబర్ 27 : మూసీ ప్రక్షాళనతో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం అన్నారు. మండలంలోని మానాయికుంట నుంచి శాలిగౌరారం మండలం గురజాల గ్రామ శివారు వరకు ఆదివారం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నది పరీవాహక ప్రాంత రైతులు, వృత్తిదారులు, ప్రజలకు మూసీ ప్రక్షాళనపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీళ్లు తెచ్చి పరీవాహక ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. మూసీ ప్రక్షాళనకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాసోజు శంకరమ్మ, జ్ఞానసుందర్, ఆయా మండలాల అధ్యక్షులు పోలెబోయిన లింగయ్యయాదవ్, వంగాల సత్యనారాయణ, సమరంరెడ్డి పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రం.. భక్తజన సంద్రం

మాఢ వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, అక్టోబర్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. సెలవు కావడంతో స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపించగా నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు చేశారు. సుమారు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.36,07,901 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

29న హుండీ లెక్కింపు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపును మంగళవారం నిర్వహించనున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కొండ కింద వ్రత మండపంలో ఉదయం 7గంటలకు లెక్కింపును ప్రారంభిస్తామన్నారు.

మూసీని సుందరీకరణ చేస్తే స్వాగతిస్తాం

● మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 27 : మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకం కాదని, అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చితే వీధినపడే పరిస్థితి నెలకొంటుందన్నారు. వారికి డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలన్నీ కలుషితమయ్యాయని, ఇందుకు కారణం 40, 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ కాదా? అని ప్రశ్నించారు. చెరువులు ఆక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల్లో నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వలేదని, రుణమాఫీ 40శాతమే జరిగిందని అన్నారు. ఎంపీపీ స్వగ్రామంలో రోడ్డు అధ్వనంగా ఉన్నదని అంటున్నారని, మూడు కోట్లతో పిల్లాయిపల్లి – పెద్దగూడెం రోడ్డు వెడల్పు చేయించానని తెలిపారు. దేశ్‌ముఖి రోడ్డును ఎమ్మెల్యే ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని, మూడు లక్షలు ఖర్చు అయ్యే కల్వర్టు నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి చేస్తే సహకరిస్తామని, పేదలను ఇబ్బందులకు గురి చేస్తే సహించమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశ్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, దేవరాయ కుమార్, కుడికాల బలరాం, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి సన్మానం

ఎమ్మెల్యే అనిల్‌కమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గ సభ్యులు

వలిగొండ, అక్టోబర్ 27 : ఆర్యవైశ్య సంఘం మండల నూతన కమిటీ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బెలిద నాగేశ్వర్, గజ్జెల అమరేందర్, అప్పిశెట్టి సంతోష్, జోగి పర్తి సంతోష్‌కుమార్, గౌరిశెట్టి అశోక్, చీకటిమల్ల వెంకటేశ్వర్లు, బెలిద శ్రీనివాస్, గజ్జెల శ్రీధర్, నాగేశ్వర్ ఉన్నారు.

ప్రచార ఆర్భాటం తప్ప పనుల్లో పురోగతి లేదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

పార్టీ మండల మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

గుండాల, అక్టోబర్ 27 : సాగునీటి విడుదలలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ప్రచార ఆర్భాటం తప్ప పనుల్లో ప్రగతి లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండలంలోని పెద్దపడిశాల గ్రామంలో పోతరబోయిన సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన సీపీఎం మండల 6వ మహాసభలో ఆయన మాట్లాడారు. గుండాల మండలం అభివృద్ధిలో వెనుకబడిందని, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండల అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా ప్రజలకు సాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ బడులు మూతపడే స్థితికి వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడిచినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని విమర్శించారు. సీపీఎం పోరాటంతో సెప్టెంబర్ 27న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేసినా ఇప్పటికీ మండలంలో ఏ ఒక్క చెరువు నిండలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకపోతే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా నాయకులు బొల్లు యాదగిరి, పైళ్ల యాదిరెడ్డి, మండల కార్యదర్శి మద్దెపురం రాజు, నాయకులు వెంకటనర్సు, అనిల్, అంజయ్య, బాలయ్య, ఖలీల్, యాకన్న, పెద్దరామయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక

రాజపేట, అక్టోబర్ 27 : మండలంలోని బొందుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇప్ప లోకేశ్, పాముకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థి రెడ్డబోయిన సాహితీ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ చందా రమేశ్ తెలిపారు. వాలీబాల్ అండర్–17 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 28నుంచి 30వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా తరపున వారు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎంఈఓ రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మూసీని నాశనం చేసిందే కాంగ్రెస్ : బీఆర్ఎస్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

అడ్డగూడూరు, అక్టోబర్ 27 : గతంలో 50 ఏండ్లు పాలించి మూసీని భ్రష్టు పట్టించి, నాశనం చేసిందే కాంగ్రెస్ పార్టీ అని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూసీ ప్రక్షాళన కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేసి రూ.16వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు ప్రయత్నించిందన్నారు. 2014కు ముందు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు దాచుకో, దోచుకో అనేలా ఉందని ఆరోపించారు. మూసీ సుందరీకరణకు రూ.30వేల కోట్లు అవసరం అవుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ.1.50 లక్షల కోట్లు కేటాయించిందని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మూసీ ప్రక్షాళన పేరుతో కాలాయపన చేస్తుందని విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు పోగుల నర్సిరెడ్డి, వీరస్వామి, మాజీ ఎంపీటీసీ పి.జనార్దన్‌రెడ్డి, నాయకులు అరవింద్, సైదులు, వెంకటయ్య, వెంకన్న, రవి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ పిల్లల విధి : తాసీల్దార్

వానప్రస్తాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న తాసీల్దార్ హరికృష్ణ, సీఐ మన్మథకుమార్, సొసైటీ ప్రతినిధులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 27 : తల్లిదండ్రుల పోషణ వారి సంతానం విధిగా భావించి నిర్వర్తించాలని తాసీల్దార్ ఎస్.హరికృష్ణ అన్నారు. మండలంలోని పెద్దకొండూరు గ్రామంలోని వానప్రస్తాశ్రమంలో మదర్ థెరిస్సా సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేసిన 3లక్షల రూపాయల విలువైన నిత్యావసరాలను సీఐ మన్మథకుమార్‌తో కలిసి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యం చేసే వారిపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. పసితనంలో పిల్లలను దైవంగా కొలిచిన తల్లిదండ్రులను భారంగా భావించకూడదని సూచించారు. వృద్ధులను అక్కున చేర్చుకుని ఆశ్రమం కల్పించి సేవ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు అశోక్‌కుమార్‌ను సీఐ మన్మథకుమార్ అభినందించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సోషల్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కిశోర్, కార్యదర్శి ఎలీషా, డైరెక్టర్ సుధీర్, సమీరాబేగం, సువర్ణ, శివారెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

శ్రీరాములుకు రాష్ట్రస్థాయి ఎక్స్‌లెన్స్ పురస్కారం

రాష్ట్రస్థాయి ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకుంటున్న బడుగు శ్రీరాములు

చౌటుప్పల్, అక్టోబర్ 27 : మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ పురస్కారం చౌటుప్పల్ పట్టణానికి చెందిన విద్యావేత్త బడుగు శ్రీరాములుకు లభించింది. సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, ఆధ్యాత్మిక, ధార్మిక, కళారంగాల్లో విశేష కృషి చేసినందుకు ఆయనను ఈ పురస్కారం వరించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మెగా సిటీ కళావేదిక భాగ్యనగరం సంస్థ వారు ఆదివారం ఈ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు గోశిక భిక్షపతి, పోలోజు రాజు, పాలకూర్ల మురళి, బొంగు జంగయ్య గౌడ్, వేముల నర్సింహ, గట్టు రవి పాల్గొన్నారు.

సీపీఎం ఆలేరు మండల కార్యదర్శిగా వెంకటేశ్

దూపటి వెంకటేశ్

ఆలేరు రూరల్, అక్టోబర్ 27 : సీపీఎం ఆలేరు మండల కార్యదర్శిగా దూపటి వెంకటేశ్ ఎన్నికయ్యారు. మండలంలోని గుండ్లగూడెంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శివర్గ సభ్యులుగా సుదగాని సత్యరాజయ్య, జూకంటి పౌల్, నల్లమాస తులసయ్య, పిక్క గణేశ్, దాసి శంకర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ ఆలేరు ప్రభుత్వ దవాఖానను వంద పడకల స్థాయికి పెంచాలని, గంధమల్ల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి ఆలేరు మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందజేయాలని డిమాండ్ చేశారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 27 : రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మండలంలోని దోతిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యానికి మార్కెట్ సౌకర్యం కల్పించాలని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 25న దోతిగూడెంలో నిర్వహించే సీపీఎం మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ధాన్యం తూకంలో, రైస్ మిల్లుల్లో అవకతవకలను అరికట్టాలని, కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూసీ జల కాలుష్యాన్ని అరికట్టి గోదావరి జలాలు అందించాలని, పిలాయిపల్లి కాల్వను పూర్తి చేసి చౌటుప్పల్ వరకు సాగునీరు అందించాలని అన్నారు. సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకుడు గూడూరు అంజిరెడ్డి, మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, విష్ణు, మధు, బుచ్చిరెడ్డి, జంగయ్య, భిక్షపతి, కిషన్ పాల్గొన్నారు.

దొంగ బాబాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సోలోమాన్‌రాజ్

ఆత్మకూరు(ఎం), అక్టోబర్ 27 : గ్రామాల్లో భిక్షాటన చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న దొంగ స్వాములు, బాబాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ పి.సోలోమాన్‌రాజు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దొంగ తనాల నియంత్రణకు అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రధాన వీధుల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. వ్యవసాయ బావుల వద్దకు, ఊర్లకు వెళ్లినప్పుడు ఇంటికి తాళం వేసి తాళం చెవిని వెంట తీసుకుపోవాలన్నారు. బంగారు ఆభరణాలు, అవసరానికి మించిన డబ్బును బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాబాల వేషంలో భిక్షాటన కోసం వచ్చేవారిని ఇంట్లోకి రానివ్వకుండా జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బంది ఆంజనేయులు, రాంచందర్, విజయ్, గాయత్రి, ప్రేమలత, పద్మ పాల్గొన్నారు.

కళాకారుడి కుటుంబానికి చేయూత

బ్యాంకు డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న కళాకారులు

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 27 : మండలంలోని పంతంగి గ్రామానికి చెందిన తబలా కళాకారుడు బుడ్డా విజయ్‌కుమార్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో సహచర వాయిద్య కళాకారులు చందాలు వేసి లక్ష రూపాయలను విజయ్‌కుమార్ కుమార్తె హరిత పేరున బ్యాంకులో డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రాన్ని ఆదివారం అందజేశారు. తోటి కళాకారుడి కుటుంబాన్ని ఆదుకోవడం తమ విధిగా భావించి ఈ సాయం అందజేసినట్లు కళాకారులు ఎండీ హమీద్, గిరి అన్నారు.

కొడారి వెంకటేశ్‌కు పూలే జాతీయ అవార్డు

పూలే జాతీయ అవార్డు అందుకుంటున్న కొడారి వెంకటేశ్

భువనగిరి అర్బన్, అక్టోబర్ 27 : బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర ఏడవ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త కొడారి వెంకటేశ్‌కు మహాత్మా జ్యోతిబాపూలే అవార్డును సినీ గేయ రచయిత మల్లిక్ అందజేశారు. మూడు దశాబ్దాలుగా సమాజంలోని సామాజిక రుగ్మతల నిర్మూలనకు, పిల్లల హక్కుల రక్షణ, నాణ్యమైన విద్య కోసం, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధులకు మనోధైర్యం కల్పిస్తూ, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం నిరంతరం కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు వచ్చింది. అవార్డు రావడం సంతోషంగా ఉందని వెంకటేశ్ అన్నారు.

'హామీలను అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

చౌటుప్పల్, అక్టోబర్ 27 : ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిళ్ల శ్రీరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఉద్యమకారులకు 10శాతం కేటాయించాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఫోరం మండలాధ్యక్షుడు గట్టు సుధాకర్, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గోశిక జగదీశ్, నాయకులు ఎండీ ఖలీల్, భీమనగోని మల్లేశ్‌గౌడ్, మల్లెబోయిన లక్ష్మయ్య, ఈపూరి శేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రామన్నపేట, అక్టోబర్ 27 : మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన రచ్చ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. ఆయనది నిరుపేద కుటుంబం కావడంతో న్యాయవాదులు మేకల దుర్గయ్య, యాదాసు యాదయ్య ఆదివారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును ఈపూరి విశ్వప్రసాద్, మిర్యాల రవీందర్, ఈపూరి లక్ష్మీనర్సింహస్వామి, శ్రీనివాస్, కవిత, మాధవి, నాగేశ్వర్‌రావు సమకూర్చారు.

తుర్కపల్లి : మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన మేకల కొమురమ్మ (80) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన కొడారి లతామల్లేశ్ ఆదివారం పరామర్శించి సానుభూతి తెలిపారు. రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, అక్టోబర్ 27 : పట్టణంలోని 16వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిళ్ల మురళి, ఆవుల యేసు, ఎండీ యేజాస్, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన

రోడ్డుపై వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

రామన్నపేట, అక్టోబర్ 27 : మండలంలోని వెల్లంకి నుంచి గుండ్రాంపల్లి గ్రామం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నకిరేకంటి గణేశ్ మాట్లాడుతూ 21సంవత్సరాల క్రితం నిర్మించిన వెల్లంకి – గుండ్రాంపల్లి రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. కొత్త రోడ్డు నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మిర్జా ఫజల్ బేగ్, నకిరేకంటి నరేందర్, పోశబోయిన మల్లేశ్, కుర్మ మహేందర్, తుడి సంజయ్, నర్సింహ, ప్రదీప్, మల్లేశ్ పాల్గొన్నారు.

పాలడుగులో వైద్య శిబిరం

వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ వెంకటేశ్వర్లు

మోత్కూరు, అక్టోబర్ 27 : మండలంలోని పాలడుగు గ్రామంలో చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకుల సహకారంతో హైదరాబాద్ ఆర్కే దవాఖాన డాక్టర్ సీహెచ్ రాజ్‌కుమార్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నాగరాజు, ఆర్గనైజర్ కొంపెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చౌటుప్పల్ రూరల్ : పెద్దకొండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్‌విండో చైర్మన్ దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్ 27 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మసీదుగూడెం, పెద్దకొండూరు, నక్కలగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్న రకం ధాన్యాన్ని తాళ్లసింగారం గ్రామంలోని కేంద్రానికి తీసుకురావాలన్నారు. సన్న ధాన్యానికి మద్దతు ధర రూ.2,320తోపాటు రాష్ట్ర ప్రభుత